# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశానికే ఆదర్శంగా నిలిచేలా పీ4 కార్య క్రమం రూపొందించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లో మామిడి, పొగాకు పంటలను కొనుగోలు చేసి ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరను కల్పిస్తుందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.**

3. **తెలంగాణలో సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.**

4. **విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టును 21వేల 616 కోట్ల రూపాయలతో పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.**

5. **దేశవ్యాప్తంగా ఈరోజు కార్గిల్ విజయ్‌దివస్ జరుపుకుంటున్నాం.**

============================

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ-4 కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు మార్గదర్శి బ్యాడ్జిని ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ చంద్రబాబునాయుడుకు అందించారు. అమరావతిలోని సచివాలయం నుంచి పీ-4 కార్యక్రమంపై మంత్రులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి దృశ్య శ్రవణ మాధ్యమ సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు మార్గదర్శి పోస్టర్, బ్యాడ్జిలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సమాజంలో పేద-ధనికుల మధ్య అంతరాలు తగ్గించే ఇలాంటి కార్యక్రమాన్ని మరెక్కడా చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచేలా రూపొందించామని తెలిపారు. పేదలకు చేయూతనిచ్చే పీ4 కార్య క్రమం నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలను పి-4 విధానంలో అభివృద్ధి చేయనున్నట్లు బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఇందుకు దాతలు, ఎన్‌టిఆర్ విదేశీ విద్య పథకం కింద గతంలో లబ్ధిపొంది, ఉన్నత స్థితిలో ఉన్న వారి సాయం తీసుకోనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఏదైనా వసతి గృహాన్ని లేక స్థాయికి తగ్గ సంఖ్యలో విద్యార్థులను దత్తత తీసుకోవచ్చున్నారు. వసతి గృహాలకు ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్లు, మరమ్మతు పనులు, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, వంటి పనులకు ఆర్థిక

సాయమందించవచ్చని తెలిపారు. దాతలు అందించిన నిర్మాణాలు, సామగ్రిపై వారి పేర్లను ప్రచురిస్తామన్నారు. సామాజిక సేవ పట్ల ఆసక్తి కలిగి ఉన్నవారు directorapbcwelfare@gmail.com మెయిల్, లేదా 63008-76401, 79893-44521 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

---------------------------

తెలంగాణలో సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాదులోని సచివాలయంలో రాష్ట్రంలో సాగవుతున్న పంటల వివరాలను అంచనా వేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిపాదించిన ప్రాజెక్టుపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ప్రభుత్వం అమలు చేయనున్న పంటల బీమా పథకానికి సమగ్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం అందించాలన్నారు. పంట విస్తీర్ణం అంచనా వేయడంతో రానున్న కాలంలో ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసేందుకు వీలుంటుందని తెలిపారు.

---------------------------

విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టును 21వేల 616కోట్లతో పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. రెండు నగరాల్లో మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక సహకారం, డిజైన్లు, పనుల పర్యవేక్షణకు శిస్ట్రా, టిప్సాసంస్థలతో మంత్రి సమక్షంలో మెట్రోరైల్ కార్పొరేషన్ ఎంఒయు నిన్న కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్... 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ -డిఆర్డీఓ చేపట్టిన నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ పరీక్షలో భాగంగా లాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ క్షిపణి - యుల్ పిజిఎం-వి3 పరీక్ష విజయవంతమవడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సామాజిక మాధ్యమం వేదికగా హర్షం వ్యక్తం చేశారు. దేశ రక్షణ వ్యవస్థ వృద్ధికి దోహదపడటం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. పరీక్ష విజయవంతం అవడానికి కారకులైన శాస్త్రవేత్తలను, ఆవిష్కర్తలను అభినందించారు. ఈ విజయం ఆత్మనిర్భర్ భారత్ నిజమైన స్ఫూర్తిని ప్రతిభింబిస్తుందని పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 124వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

దేశవ్యాప్తంగా ఈరోజు కార్గిల్ విజయ్‌దివస్ జరుపుకుంటున్నాం. కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం విజయానికి గుర్తుగా ఈదివస్‌ను నిర్వహిస్తున్నారు. 1999 జూలై 26న కార్గిల్‌లో భారత త్రివర్ణ పతాకం

రెపరెపలాడింది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులను భారతసైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. కశ్మీర్‌లో పాగా వేయాలనుకున్న పాకిస్తాన్ ప్రయత్నాన్ని భారత జవాన్లు సమర్థంగా ఎదుర్కొన్నారు. పాకిస్తాన్‌పై భారత్ సాధించిన చారిత్రాత్మక విజయాన్ని స్మరించుకుంటూ భరతమాత కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్లను తలుచుకుంటూ... ఈరోజు కార్గిల్ 'విజయ్ దివస్'గా దేశమంతటా జరుపుకుంటున్నాం.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మామిడి, పొగాకు పంటలను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పిస్తుందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. బాపట్ల జిల్లా పర్చూరులో సుపరిపాలన – తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావుతో కలిసి నిన్న పర్యటించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ.. లాభ నష్టాలతో నిమిత్తం లేకుండా పంటలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొంటూ..

వాయిస్.. 25 సెకన్లు

అనంతరం డ్వాక్రా సంఘాల సభ్యులకు 4 కోట్ల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.145 మందికి 83 లక్షల చెక్కులను పంపిణీ చేశారు.

---------------------------

ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడి.. వాయవ్య బంగాళాఖాతం వైపుగా కదులుతూ నిన్న పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..30 సెకన్లు

మరోవైపు.. తెలంగాణలో ఈరోజు, రేపు మోస్తరు నుంచి భారీ కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది.

---------------------------

బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిన నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నందున తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో వర్షాలపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. వాయుగుండం ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని తీర ప్రాంతం వెంబడి గంటకు 40 నుంచి 60 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు, సముద్రపు అలలు 2.9 నుంచి 3.6 మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడే వీలుందని చెప్పారు. అత్యవసర సమయంలో సహాయక చర్యలకు కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101ను సంప్రదించాలని సూచించారు. వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

======================